## క్లుప్తంగా

### సైనికుల కోసం పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

**కోనరావుపేట:** బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజీ ఆధ్వర్యంలో దేశ త్రివిధ దళాల సైనికుల కోసం పూజలు నిర్వహించారు. మల్కపేటలోని రామాలయంలో ఆదివారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో సైనికులు ఆయురారోగ్యాలతో ఉండాలని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు దేవరాజు, ఎడ్ల సుధాకర్, బొల్లారం తిరుపతి, దడిగే గంగయ్య, రాజేశ్, మహిపాల్, విజయ్, వేణు, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

### హామీలన్నీ అమలుచేస్తాం



మాట్లాడుతున్న మునిగెల రాజు

**తంగళ్లపల్లి:** బీఆర్ఎస్‌కు మాజీ మంత్రి కేటీఆర్‌కు ప్రజల్లో ప్రాబల్యం తగ్గిందని దీంతో సేనల పేరుతో కొత్త దుకాణానికి తెరలేపారని యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగెల రాజు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయడం లేదనడం హాస్యాస్పదమన్నారు. ఇప్పటికే ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో హామీలన్నీ అమలుచేస్తామన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చుక్క రాజశేఖర్, మండల యూత్ అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్, హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్, గడ్డం మధుకర్ (చోటు), గుగ్గిళ్ల అభినయ్ గౌడ్, ఎడ్ల తిరుపతి, భాను, యోగి, వినోద్, దేవదాస్, ప్రశాంత్, చందు, మణి పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు భూమిపూజ



**తంగళ్లపల్లి:** మండలకేంద్రంలోని వివేకానంద కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం ఆదివారం సెస్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. కాలనీలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెస్ హెల్పర్ అనిల్, కాలనీవాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సీసీరోడ్డు నిర్మాణానికి..



రామన్నపేటలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చందుర్తి:** మండలంలోని రామన్నపేటలో ఈజీఎస్ నిధులతో మంజూరైన సీసీరోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భీంరాజు కనుకరాజు ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామంలో రూ.5లక్షలతో సీసీరోడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముదిగంపల్లి కిషన్, తిప్పని శంకర్, నారాయణ, బొడ్డు తిరుపతి, రాజయ్య, భూమయ్య, కొత్త శ్రీనివాస్‌రెడ్డి, దుమ్ము నర్సయ్య, పత్తిపాక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



**వేములవాడరూరల్:** వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కోనాయపల్లి వద్ద రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నాగాయపల్లికి చెందిన వ్యక్తి తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ శంకరయ్య, ప్రశాంత్‌లను ఆస్పత్రికి తరలించారు. నాగాయపల్లికి చెందిన శంకరయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

# వైభవంగా బ్రహ్మోత్సవాలు

- కొత్తపల్లిలో కొనసాగుతున్న శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు
- 500 ఏళ్లుగా వెలుగుతున్న నంద దీపం
- నేడు గరుడసేవ, రేపు రథోత్సవం



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు



500 ఏళ్లుగా వెలుగుతున్న నంద దీపం

**గంభీరావుపేట:** మండలంలోని కొత్తపల్లిలో నూతనపురి శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రోజుకో వాహనంపై స్వామివారు పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆదివారం ఆలయంలో సుదర్శన హోమం ఘనంగా నిర్వహించారు. సోమవారం గరుడ సేవోత్సవం, మంగళవారం కనుల పండువగా రథోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు పట్నంలో స్థిరపడిన వారు సైతం కొత్తపల్లె బాట పట్టారు. విద్యా సంస్థలకు వేసవి సెలవులు కావడంతో పట్నం నుంచి వచ్చిన వారితో పల్లె సందడిగా మారింది.

### అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణకు కనివినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశాం. 500 ఏళ్ల చరిత్ర గల ఆలయాన్ని సందర్శించడానికి భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం అలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నం. – శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్, కొత్తపల్లి

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తంగళ్లపల్లి: సమావేశమైన పూర్వ విద్యార్థులు

**తంగళ్లపల్లి:** మండలంలోని మండెపల్లి సరస్వతి పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. ఒకరికొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కోనరావుపేట:** మండలంలోని సుద్దాల ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వారితో కలిసి చదివిన తోటి స్నేహితురాలు కొండ కవిత భర్త మృతిచెందగా ఇద్దరు కూతుళ్ల చదువుల నిమిత్తం రూ.15 వేలు అందజేశారు.

## మున్నూరుకాపు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

**సిరిసిల్లటౌన్:** మున్నూరుకాపు రాష్ట్ర మహాసభల పోస్టర్లను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య ఆవిష్కరించారు. ఆదివారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. త్వరలో అన్ని నియోజకవర్గాల్లో కుల బాంధవులను చైతన్య పరుస్తూ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. సంఘం అభివృద్ధి కోసం కొత్తగా అన్ని నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా నుంచి సిరిసిల్ల నియోజకవర్గం ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులను ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, ఫోన్నేటి శంకర్ అధ్వర్యంలో ఆరుగురు కమిటీ సభ్యులను మాసం రత్నాకర్, పటేల్, శీలం రాజు, కొమిరిశెట్టి లక్ష్మణ్, ధూమాల రవి, పడిగాల రాజు పటేల్, మనోహర్ పేర్లు ప్రకటించారు.

### కూల్.. కూల్‌గా !



ఎండలు దంచి కొడుతున్నాయి. భానుడి ప్రతాపానికి జనం ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు స్విమ్మింగ్‌పూల్ బాట పడుతున్నారు. గంభీరావుపేటలోని స్విమ్మింగ్ పూల్ చిన్నారులు, పెద్దవాళ్లతో కళకళలాడుతోంది. తమ పిల్లలకు ఈత నేర్పేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.
– గంభీరావుపేట

## మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు



జమునాదేవిని సన్మానిస్తున్న పద్మలత, వైద్యులు

**వేములవాడ:** మహిళలపై దాడుల నివారణకు ధీర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లా గైనకాలజిస్టు అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ పద్మలత పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా గైనకాలజిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం కరీంనగర్‌లోని వీ–పార్క్ హోటల్‌లో జరిగాయి. ఏకగ్రీవంగా ఎన్నికైన పద్మలతో యశోద హస్పిటల్ స్త్రీల వైద్య నిపుణురాలు సీనియర్ వైద్యురాలు జమానాదేవి ప్రమాణ స్వీకారం చేయించారు. మదర్స్ డే సందర్భంగా అంతా కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పద్మలత మాట్లాడుతూ మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామనీ, రక్తహీనత నిర్మూలన, క్యాన్సర్ నివారణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామన్నారు. శోభారాణి, లీలాశిరీష,సింధు, గీతావాణి, నాయని, పద్మిణి, తాత్విక, గీత, విజయలక్ష్మి, విజయ భారతి, శ్రీదేవి, పద్మప్రియ, అనిత తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు చిక్కిన దొంగలు

- గతనెల మండలకేంద్రంలో చోరీ

**చందుర్తి:** మండలకేంద్రంలోని రెండిళ్లలో దొంగతనానికి పాల్పడిన దొంగలను నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. గతనెల 16న అర్ధరాత్రి మండలకేంద్రంలోని సిర్రం రాజవ్వ ఇంట్లో రూ.15వేలు, వెంగళి వినోద ఇంట్లో రూ.25 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఫాస్టర్ ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లి మర్రిగడ్డ గ్రామ శివారులోని ఒర్రెలో పడేసి వెళ్లారు. ఈ దొంగతనంపై చందుర్తి పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా గాలించిన ఫలితం లేకుండా పోయింది, కాగా ఇందల్‌వాయి పోలీసులకు అనుమానం వచ్చి పట్టుకుని విచారించగా , వారు ఎక్కడెక్కడ దొంగతనాలకు పాల్పడ్డారో పోలీసులకు తెలిపినట్లు తెలిసింది. కాగా చందుర్తిలో చోరీకి పాల్పడ్డ దేవసారి రాజేశ్‌ది జనగాం జిల్లా పాలకుర్తి గ్రామంగా, దాసరి మురళి, నర్సయ్య, నాగయ్యనే ముగ్గురిది మహబూబాబాద్ జిల్లా అసనిపర్తి గ్రామానికి చెందిన వారని పోలీసులు గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. దొంగతనానికి పాల్పడింది ఇద్దరు వ్యక్తులేనని భావించినా, పోలీసుల విచారణలో మాత్రం నలుగురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు సమాచారం. సెల్‌టవర్ సిగ్నల్ ఆధారంగా దొంగల కోసం గాలించినప్పటికీ అచూకీ చిక్కలేదు. చివరకు నిజామాబాద్ జిల్లాలోని ఇందల్‌వాయి పోలీసులకు చిక్కడంతో చందుర్తి పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## వృద్ధాశ్రమంలో మదర్స్ డే వేడుకలు



గంభీరావుపేట: మండలకేంద్రంలోని మా అనాథ వృద్ధుల ఆశ్రమంలో మదర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వృద్ధులను ఆత్మీయంగా పలుకరిస్తూ ఆశ్రమం నిర్వాహకులు స్నాక్స్ తినిపిస్తూ కొడుకుగా.. ఆత్మబంధువుగా మీకు నేనున్నానంటూ.. భరోసా కల్పించారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సిరిసిల్ల:** పట్టణంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ×సెస్₹ అధికారులు ఆదివారం తెలిపారు. పట్టణంలోని 11 కేవీ లైన్ మెయింటనెన్స్ కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు కార్గిల్‌లేక్, కొత్తబస్టాండ్, వెంకట్రావునగర్, నెహ్రూనగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

**వీర్నపల్లి:** మండలకేంద్రంలోని 11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని భూక్యతండాలో మరమ్మతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు ఏఈ రమేశ్ తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

### నియామకం



రమేశ్

**గంభీరావుపేట:** బీజేపీ మండల అధ్యక్షుడిగా ముస్తఫానగర్ గ్రామానికి చెందిన కోడె రమేశ్ నియమితులయ్యారు. మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పనిచేసిన రమేశ్‌ను పార్టీ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. రమేశ్ నియామకంపై పలువురు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

### వీర జవాన్లకు నివాళి



**సిరిసిల్లకల్చరల్:** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అమరులైన భారత జవాన్లకు జిల్లాలో పలువురు కవి, రచయితలు నివాళి అర్పించారు. ఆదివారం లక్ష్మణ్ ప్రింటర్స్‌లో సమావేశమైన జిల్లా సాహితీ సమితి సభ్యులు రెండు నిముషాలు మౌనం పాటించి అమరులకు సంతాపం ప్రకటించారు. ప్రతినిధులు డాక్టర్ జనపాల శంకరయ్య, బూర దేవానందం, వెంగల లక్ష్మణ్, గుండెల్లి వంశీ కవితా గానం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు చేపూరి బుచ్చయ్య, ఏనుగుల ఎల్లయ్య, కోడం నారాయణ, అంకారపు జ్ఞానోభ తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం



**ముస్తాబాద్:** జాతీయ బీసీ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కదిరె వేణుగోపాలస్వామిగౌడ్‌ను ముస్తాబాద్ మండలం మద్దికుంటలో వేణుగోపాల హమాలీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

### 11మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

**ఇల్లంతకుంట:** మండలంలోని పెద్దలింగాపూర్ పెట్రోల్ బంక్ చౌరస్తా వద్ద ఆదివారం ఎస్సై కే శ్రీకాంత్ గౌడ్ వాహనాల తనిఖీ చేపట్టారు. మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది, ఉన్నారు.

## బీట్ అధికారిపై స్మగ్లర్ దాడి

**చందుర్తి(వేములవాడ):** అక్రమంగా టేకు కలప రవాణాను అడ్డుకున్న ఫారెస్టు బీట్ అధికారిపై స్మగ్లర్ శనివారం రాత్రి దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనుగుల ఫారెస్టు బీట్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సిర్రోళ్ల బాలకృష్ణకు చందుర్తి మండలం దేవునితండా గ్రామ శివారులోని మకుల ఎల్లమ్మ ఆలయం సమీపంలో అక్రమంగా టేకు కలప రవాణా చేస్తున్నారన్న సమాచారం అందింది. దీంతో ఫారెస్టు వాచర్ పిట్టల తిరుపతితో కలిసి అక్కడికి చేరుకున్నారు. టేకు కలప రవాణా చేస్తున్న దేవునితండాకు చెందిన అజ్మీరా తిరుపతిని అడ్డుకునే క్రమంలో బీట్ అధికారి బాలకృష్ణపై దాడి చేశాడు. ఈ విషయం తెలుసుకున్న చందుర్తి ఎస్సై అంజయ్య అక్కడికి చేరుకున్నారు. బాధితుడు బాలకృష్ణ ఫిర్యాదుతో అజ్మీరా తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఈ సందర్భంగా అంజయ్య పేర్కొన్నారు.



**ఎల్లారెడ్డిపేట:** ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతాలు చీకట్లో మగ్గుతున్నాయి. సెస్ అధికారులు, పంచాయతీ అధికారుల మధ్య సమన్వయ లోపంతో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయలేకపోతున్నారు. మండలకేంద్రం శివారు ప్రాంతాలు చీకటిమయంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. అప్పుడప్పుడు దొంగతనాలు జరుగుతున్నాయి.శివారులో వాహనదారులు ప్రమాదాలబా రిన పడుతున్నారు. వెంటనే శివారు ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
ప్రవీణ్‌కుమార్, ఈవో, ఎల్లారెడ్డిపేట: సెల్ నంబర్: 80745410 33

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

# నృసింహుడికి ప్రత్యేక పూజలు



గంభీరావుపేట: స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



తంగళ్లపల్లి : యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

**రుద్రంగి:** శ్రీ లక్ష్మినర్సింహ స్వామి జన్మదినం పురస్కరించుకొని మండలకేంద్రంలోని నర్సింహ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని పూలతో అందంగా అలంకరించారు. రుద్రంగి ఏఎంసీ చైర్మన్ చెలుకల తిరుపతి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారికి పూజలు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**తంగళ్లపల్లి:** మండలకేంద్రంలోని స్వయం భూ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంతోపాటు నేరెళ్ల ఇస్కాన్ టెంపుల్‌లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవకలశ పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, నరసింహ సుదర్శన హోమం, నరసింహ యజ్ఞాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో శ్రీమాన్ శ్రీ ప్రాణనాథ అచ్యుత దాస ప్రభుజీ, భక్తులు పాల్గొన్నారు.

**గంభీరావుపేట:** మండలంలోని నాగంపేటలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని రథంపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదానం చేశారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులను సన్మానిస్తున్న భూక్య రామిరెడ్డి

**వీర్నపల్లి:** చదువుతోనే ఉజ్వల భవిష్యత్ అని సీబీడీ నార్కొటిక్స్ హైదరాబాద్ ఎస్పీ భూక్యరామిరెడ్డి అన్నారు. గర్జనపల్లిలో ఇటీవల ఇంటర్మీడియెట్, పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం సీతారాంనాయక్ తండాలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గర్జనపల్లిలో పేద విద్యార్థుల ఉన్నత విద్యతోపాటు సివిల్స్ శిక్షణకు తోడ్పాటు అందిస్తామన్నారు. ఎస్పీ రాంరెడ్డి కుమారుడు రాంసాయికిరణ్, కుమార్తెలు నందిత, ప్రణీత ప్రతీనెల రూ.15వేల వేల ఆర్థిక తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ధూమానాయక్ సేవా సమితికి విరాళాలు ప్రకటించారు. మాజీ సర్పంచులు శ్రీనివాస్, రవి, రంజిత్, టీచర్ అసోసియేషన్ సభ్యులు దేవేందర్, గోవర్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


### రేషన్ బియ్యం ఎప్పుడిస్తారు ?

**కోనరావుపేట:** ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి చివరికి రేషన్ బియ్యం కూడా సకాలంలో పంపిణీ చేయలేని పరిస్థితిలో ఉందని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం మాట్లాడుతూ గతంలో ఒకటో తేదీ వరకే దుకాణాలకు బియ్యం చేరేవన్నారు. ఈనెల 11 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు రేషన్ బియ్యమే రాలేదన్నారు. ఏప్రిల్ నుంచి సన్నబియ్యం అందిస్తున్న ప్రభుత్వం రెండో నెలకే ఆలస్యం చేయడం ఏంటని ప్రశ్నించారు. సన్నబియ్యం ఇచ్చేందుకు వీలు కాకపోతే గతంలో మాదిరిగా దొడ్డు బియ్యం ఇచ్చినా పేదవారి ఆకలిబాధలు తగ్గుతాయన్నారు.

**రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలి**

**వీర్నపల్లి:** మండలంలోని గర్జనపల్లిలోని ఎస్సీకాలనీలో ఇటీవల సీసీరోడ్డు వేసినా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు, కాలనీవాసులు వాపోతున్నారు. వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి దావ పోచయ్య, బీఎస్పీ సిరిసిల్ల నియోజకవర్గ కార్యదర్శి ఇసంపల్లి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

### వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

| కాంప్లెక్స్ పేరు | ఖాళీల సంఖ్య | అద్దె రూ. |
|---|---|---|
| అమ్మవారి కాంప్లెక్స్ | 0 | 1,680 |
| భీమేశ్వర సదన్ ఏసీ | 0 | 1,344 |
| భీమేశ్వర సదన్ సూట్స్ | 0 | 1,680 |
| భీమేశ్వర గెస్ట్‌హౌస్ | 0 | 2,800 |
| నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ | 0 | 1,008 |
| నందీశ్వర నాన్‌ఏసీ | 0 | 560 |
| నందీశ్వర సూట్స్ | 0 | 2,800 |
| లక్ష్మీగణపతి కాంప్లెక్స్ | 0 | 448 |
| పార్వతీపురం స్పెషల్ | 0 | 672 |
| పార్వతీపురం సాధారణ | 0 | 336 |

– వేములవాడ